ప్రజాశక్తి
శనివారం 8 ఫిబ్రవరి 2025
5
శ్రీ సత్యసాయి



అంగన్వాడీ పోస్టులకు 11న ఇంటర్వ్యూలు

ఐసిడిఎస్ పీడీ సుధావరలక్ష్మి

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

జిల్లాలో ఖాళీగా ఉన్న వివిధ అంగనవాడీ పోస్టులకు ఈనెల 11 నుంచి 14 వరకు ఆయా డివిజన్ కేంద్రాలలో అర్హులైన వారికి ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు ఐసిడిఎస్ పీడీ సుధా వరలక్ష్మి పేర్కొన్నారు. శుక్రవారం జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారిక అధికారి ఒక ప్రకటన విడుదల చేశారు. జిల్లాలో 11 ప్రాజెక్టులలో ఖాళీగా ఉన్న పోస్టులకు 309 దరఖాస్తులను స్వీకరించామన్నారు. ఇందులో వివిధ కారణాలవల్ల 116 దరఖాస్తులు తిరస్కరించినట్లు వివరించారు. 10 అంగనవాడి కార్యకర్తలు, ఆరు మినీ అంగనవాడి కార్యకర్తలు, 64 మంది సహాయక పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. అర్హులైన 193 మంది అభ్యర్థులకు ఆయా రెవిన్యూ డివిజన్ ప్రధాన కార్యాలయంలో 11 నుంచి 14 వరకు ఇంటర్వ్యూలు జరుగుతాయన్నారు. దరఖాస్తు చేసుకున్న వారు ఆయా డివిజన్ కార్యాలయాల్లో ఇంటర్వ్యూలకు హాజరు కావాలని ఆమె కోరారు.



టిడ్కో గూ[గో]డు...!

- కొనసాగుతున్న పనులు
- దశాబ్దకాలంగా లబ్ధిదారుల ఎదురుచూపు
- ఇళ్లు ఇవ్వకుండా లబ్ధిదారుల ఖాతా నుంచి డబ్బులు కట్
- లబోదిబోమంటున్న బాధితులు

ప్రభుత్వాలు మారుతున్నా పేదల సొంతింటి కల సాకరమవడం లేదు. దశాబ్ధ కాలం క్రితం టిడ్కో రూపంలో పేదలకు సొంతింటిని అందించేందుకు చేపట్టిన నిర్మాణాలు ఇప్పటికీ పూర్తవలేదు. పదేళ్లు పూర్తవుతున్నా ఇంకా ఇంటి తాళం లబ్ధిదారునికి చేరలేదు. టిడ్కో ఇళ్లు ఎప్పుడిస్తారని లబ్ధిదారులు ఇప్పటికీ ఎదురు చూస్తూనే ఉన్నారు. వీటిపై పాలకుల ప్రకటనలు తప్పా క్షేత్ర స్థాయిలో ఎలాంటి ముందడుగూ పడడం లేదు.

ప్రజాశక్తి-కదిరి టౌన్

పట్టణ ప్రాంతాల్లో పేదలకు సొంతింటిని ఇవ్వాలన్న ఉద్దేశంతో 2014లో అప్పటి టిడిపి ప్రభుత్వం టిడ్కో గృహ నిర్మాణాలను చేపట్టింది. ప్రభుత్వం, లబ్ధిదారుని వాటాతో అపార్ట్‌మెంట్ తరహాలో వీటి నిర్మాణాలకు శ్రీకారం చుట్టారు. ఇలా కదిరి పట్టణ సమీపంలోని గట్లు వద్ద టిడ్కో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభం అయ్యాయి. కదిరిలో టిడ్కో గృహాలకు సంబంధించి 1104 మంది లబ్ధిదారులను ఎంపిక చేశారు. వీరికి ఒక్కో బ్లాకులో 48 ప్లాట్ల ప్రకారం 23 బ్లాక్‌లతో నిర్మాణం చేపట్టారు. టిడిపి అధికారంలో ఉన్నంత కాలం ఈ పనులు జరిగాయి. నిర్మాణ పనులు 60 శాతం చేరుకునే సమయంలో 2019లో రాష్ట్రంలో వైసిపి అధికారంలోకి వచ్చింది. వైసిపి అధికారంలోకి వచ్చాక టిడ్కోపై నీలినీడలు కమ్ముకున్నాయి. దాదాపు రెండేళ్లు మౌనంగా ఉన్న ఆ ప్రభుత్వం ఆ తర్వాత వీటి నిర్మాణంపై దృష్టి సారించింది. అయినా నిర్మాణ పనులను పూర్తి స్థాయిలో చేయలేకపోయింది. ఈ నిర్మాణాలకు సంబంధించి లబ్ధిదారుల వాటా కింద డబ్బులనూ కట్టించుకుని, బ్యాంకుల ద్వారా రుణ సదుపాయం అందించే ఏర్పాటు చేశారు. 2022లో లబ్ధిదారుల వాటాగా రూ.25వేలు కట్టించుకుని మిగిలిన మొత్తాన్ని బ్యాంక్ ద్వారా రుణం మంజూరు చేయించారు. రుణం మంజూరు చేసినట్లు కనబరిచినా లబ్ధిదారుని ఖాతాలోకి ఈ డబ్బు పడగానే ప్రభుత్వం దానిని వెనక్కు తీసుకుంది. నిర్మాణాలు జరుగుతుండగానే వైసిపి ప్రభుత్వ హయాంలో టిడ్కో ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు రిజిస్ట్రేషన్లు చేయించారు.

లబ్ధిదారుల ఖాతాల్లో డబ్బులు కట్

టిడ్కో ఇళ్లకు సంబంధించి లబ్ధిదారుల బ్యాంకు ఖాతా నుంచి బ్యాంకర్లు రుణ వసూలు పేరుతో డబ్బులను కంతుల రూపంలో కట్ చేసుకుంటున్నారు. తమకు ఇళ్లు ఇంత వరకు ఇవ్వలేదని అలాంటప్పుడు ఖాతాలో డబ్బులు ఎలా తీసుకుంటారని లబ్ధిదారులు బ్యాంకర్లను అడిగితే వారు తమకేమీ సంబంధం లేదని చెబుతున్నారు. సొంతింటి కల నెరవేరకపోగా కాయాకష్టంతో బ్యాంకులో దాచుకున్న డబ్బులను కంతుల పేరుతో పోగొట్టుకుంటున్నామని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. టిడ్కో గృహాలకు అంకురార్పన చేసిన టిడిపి ప్రభుత్వం ప్రస్తుతం అధికారంలో ఉన్న నేపథ్యంలో వాటి నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేసి తమకు అందించాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



కదిరిలో టిడ్కో గృహాలు

ఇళ్లు ఇవ్వకుండానే డబ్బుల వసూలు



టిడ్కో గృహాలు కోసం గత ప్రభుత్వం బ్యాంక్ నుంచి రుణం మంజూరు చేయించి నట్లు ప్రకటించింది. ఖాతాలోకి డబ్బులు పడగానే మళ్లీ వారే వెనక్కు తీసుకున్నారు. గృహాలు మాత్రం ఇప్పటికీ పూర్తవలేదు. గత ఆరు నెలలు నుంచి తమ బ్యాంక్ ఖాతాలో నగదును టిడ్కో రుణానికి అంటూ తీసుకుంటన్నారు. దీనిపై ప్రభుత్వం స్పందించాలి. టిడ్కో గృహాలను అందించి, బ్యాంకర్లు తమ ఖాతా నుంచి డబ్బులు తీసుకోకుండా చర్యలు తీసుకోవాలి.

విమలమ్మ, టిడ్కో లబ్ధిదారురాలు, కదిరి పట్టణం.

రుణ వసూలు వాస్తవమే...

టిడ్కో గృహాలకు సంబంధించి లబ్ధిదారుల నుంచి బ్యాంకర్లు కంతులు వసూలు చేస్తున్న మాట వాస్తవమే. ఇది రాష్ట్ర స్థాయి సమస్య ప్రస్తుతం లబ్ధిదారులు టిడ్కోకు ఇచ్చిన బ్యాంక్ ఖాతాలో లావాదేవీలు చేయకుండా కొద్ది రోజులు ఉంటే మంచిది. ప్రభుత్వం త్వరలోనే ఈ సమస్యకు పరిష్కారం చూపుతుంది.

అవినాష్, టిడ్కో నివాసాల అధికారి.

ఫ్యాన్ గూటికి శైలు

◆ జగన్ సమక్షంలో చేరిక ◆ శింగనమలను అప్పగిస్తారా..?

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి

మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు సాకే శైలజనాథ్ పార్టీ మార్పు విషయంలో ఎట్టకేలకు స్పష్టత వచ్చింది. గత రెండు నెలలుగా ఆయన వైసిపిలో చేరుతారంటూ పెద్ద ఎత్తున ప్రచారం నడుస్తోంది. ఇందులో భాగంగానే డిసెంబర్ 26వ తేదీన కర్నూలులో ఓ వైసిపి నాయకుని వివాహ వేడుకల్లో పాల్గొన్న జగన్‌మోహన్‌రెడ్డిని శైలజానాథ్ కలిశారు. అప్పట్లోనే ఆయన వైసిపిలో చేరుతారంటూ ప్రచారం నడిచింది. అయితే పార్టీ మార్పు వెంటనే జరగలేదు. త్వరలో జగన్మోహన్‌రెడ్డి జిల్లాల పర్యటనలు ఉన్న నేపథ్యంలో ఆ పార్టీ రాజకీయంగా, సంస్థాగతంగా బలపడే చర్యలపై దృష్టి సారించింది. అందులో భాగంగానే పార్టీలో చేరికలపై దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో మాజీ మంత్రి శైలజానాథ్‌కు వైసిపి అధిష్టానం గ్రీన్ సిగ్నల్ ఇచ్చి పార్టీలో చేర్చుకుంది. శుక్రవారం ఉదయం తాడేపల్లి క్యాంపు కార్యాలయంలో వైసిపి అధినేత జగన్మోహన్‌రెడ్డి శైలజానాథ్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. శైలజానాథ్ వెంట అనంతపురం జిల్లా వైసిపి అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి, మాజీ ఎంపి తలారి రంగయ్య, మాజీ ఎమ్మెల్యేలు కేతిరెడ్డి పెద్దారెడ్డి, విశ్వేశ్వరరెడ్డిలు ఉన్నారు.

శింగనమల బాధ్యతలు అప్పగిస్తారా..?

శైలజానాథ్ చేరిక అంశంపై శింగనమల నియోజకవర్గం వైసిపిలో చర్చ నడుస్తోంది. ప్రస్తుతం శైలజానాథ్ పార్టీలో మాత్రమే చేరారు. ఈయనకు ఏ నియోజకవర్గం బాధ్యతనూ ఆ పార్టీ అప్పగించలేదు. కాగా శైలజానాథ్ శింగనమల నియోజకవర్గం నుంచి 2004, 2009లో రెండు సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. కిరణ్‌కుమార్‌రెడ్డి ప్రభుత్వంలో మంత్రిగానూ పని చేశారు. శైలు మద్దతుదారులు ఎక్కువ మంది ఆ నియోజకవర్గంలోనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఆయన్ను అదే నియోజకవర్గంలో కొనసాగిస్తారా.. లేక ఇతర నియోజకవర్గం బాధ్యతలు అప్పగిస్తారా అన్న దానిపై భవిష్యత్తులో తేలాల్సి ఉంది. ప్రస్తుతం శింగనమల బాధ్యతలను మాజీ పాఠశాలల విద్యా కమిటీ ఛైర్మన్ ఆలూరి సాంబశివారెడ్డి చూస్తున్నారు. గత ఎన్నికల్లో శింగనమల వైసిపి అభ్యర్థిగా ఎం.వీరాంజినేయులు పోటీ చేసి టిడిపి అభ్యర్థి బండారు శ్రావణిశ్రీ చేతిలో ఓడిపోయారు.



జగన్మోహన్‌రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరుతున్న శైలజనాథ్

ఎన్నికల ముందు నుంచి ఊహాగానాలు

ఎన్నికలకు ముందు శైలజానాథ్ కాంగ్రెస్ పార్టీని వీడి టిడిపిలో చేరుతున్నట్టు ప్రచారం నడిచినా అది జరగలేదు. కాంగ్రెస్ పార్టీలోనే ఉండటమే కాకుండా ఆ పార్టీ తరుపున 2024లో శింగనమల నియోజకవర్గం నుంచి పోటీ చేశారు. ఆఎన్నికల్లో ఆశించిన ఓట్లు ఏమీ పెద్దగా ఆయనకు రాలేదు. ఇటీవల వైసిపి జిల్లా అధ్యక్ష బాధ్యతలు చేపట్టిన అనంత వెంకటరామిరెడ్డి తనకున్న పాత పరిచాయల కొద్దీ ఆయన్ను వైసిపిలోకి తీసుకొచ్చే ప్రయత్నం చేసినట్టు తెలుస్తోంది. వైసిపి నుంచి శింగనమల అసెంబ్లీ నియోజకవర్గం బాధ్యతలను ఆయనకు అప్పగిస్తే బాగుంటుందన్న అభిప్రాయంతోనే ఆయన్ను వైసిపిలోకి తీసుకొచ్చే ప్రయత్నాలు చేసారని ఆ పార్టీలో చర్చ నడుస్తోంది. ఈయన రావడంతో అంతకు ముందున్న శింగనమల మాజీ ఎమ్మెల్యే జొన్నలగడ్డ పద్మావతి భర్త ఆలూరు సాంబశివారెడ్డికి కాకుండా శైలజానాథ్‌కు బాధ్యతలు అప్పగించడం ద్వారా మేలు జరుగుతుందన్న భావనతో ఈ ప్రయత్నం చేసినట్టు వైసిపిలో చర్చ నడుస్తోంది. 2024 ఎన్నికల్లోనే అలూరు సాంబశివారెడ్డి భార్య పద్మావతికి కాదని వీరాంజినేయులు అనే వ్యక్తిని వైసిపి అభ్యర్థిగా బరిలో నిలిపారు. టిప్పర్ డ్రైవర్ వీరాంజినేయులకు టికెట్టు ఇవ్వడం ద్వారా సామాన్యుడికి టిక్కెట్టు ఇచ్చామన్న రాజకీయ ప్రచారానికి ఉపయోగపడింది తప్పా, ఎన్నికల్లో గెలవడానికి దోహదం చేయలేదు. ఎన్నికల్లో ఓటమి తర్వాత నియోజకవర్గంలో వీరాంజినేయులు టిప్పర్ డ్రైవర్‌గానే జీవితం ప్రారంభించారు. ఈ నేపథ్యంలో ఈ నియోజక వర్గానికి కొత్త సమన్వయకర్తను నియమించాల్సి ఉంది. ఈ తరుణంలో శైలజానాథ్‌ను వైసిపిలోకి తీసుకొచ్చారు. రాబోయే రోజుల్లో ఆయన్నే నియోజకవర్గ సమన్వయకర్తగ నియమించే అవకాశాలున్నట్టు వైసిపి వర్గాలు అభిప్రాయ పడుతున్నాయి. దీనికి ఆ నియోజకవర్గంపై పట్టున్న తాడిపత్రి ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి కూడా మద్దతు తెలుపుతుండటంతో ఈ నియోజకవర్గంపై తిరిగి పట్టు సాధించేందుకు వైసిపి ఏ మేరకు ప్రయత్నాలు చేస్తుందన్నది వేచి చూడాల్సి ఉంది.

కమిషనర్ దృష్టికి 'పట్టు' సమస్యలు

ప్రజాశక్తి-మడకశిర

రాష్ట్ర వ్యాప్తంగా పట్టు రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం పట్టు పరిశ్రమ శాఖ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించినట్లు ఉమ్మడి అనంతపురం జిల్లా పట్టు పరిశ్రమ రైతు సంఘం అధ్యక్షుడు సోమకుమార్ తెలిపారు. విజయవాడ లోని పట్టు పరిశ్రమ శాఖ కార్యాలయంలో కమిషనర్‌ను కలిసి పట్టు రైతులకు సంబంధించిన వివిధ సమస్యలతో పాటు మార్కెట్ సమస్యలను విన్నవించగా కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కలిసిన వారిలో సంఘం జిల్లా ఉపాధ్యక్షులు రామకృష్ణారెడ్డి, సడ్లపల్లి శివశంకర్, రంగనాథ్, పలమనేరు చంద్రప్పగౌడ్ ఉన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

ప్రజాశక్తి-లేపాక్షి

గ్రామైక్య సంఘాల్లో యానిమేటర్లుగా పని చేసిన మహిళలు బకాయి వేతనాలు చెల్లించాలని కోరుతున్నారు. ఈ విషయాన్ని గతంలోనే జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లగా మండల స్థాయి అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి గ్రామైక్య సంఘాల ఖాతాలో ఉన్న సొమ్మును యానిమేటర్లకు ఇప్పించాలని ఆదేశాలు జారీ చేశారు. అయినా వారికి వేతనాలు అందలేదు. ఇదిలా ఉండగా శుక్రవారం మండలంలోని కంచిసముద్రం పంచాయతీలో గ్రామైక్య సంఘం సమావేశం నిర్వహించగా యానిమే టర్లు అక్కడికి చేరుకుని వేతనాలు చెల్లించాలని నిరసన తెలుపగా సీసీ ఏమాత్రం పట్టించుకోకుండా వెళ్లిపోయారు. ఈ విషయంపై ఏపి రామిరెడ్డిని వివరణ కోరగా గత జులై నుంచి నవంబర్ వరకూ మాత్రమే వేతనాలు మంజూరయ్యాయని తెలిపారు. అయితే గతంలో పని చేసిన తమ వేతనాలు ఏమయ్యాయని యానిమేటర్లు అరుణ, శివమ్మ ఆవేదన వ్యక్తం చేశారు.

కళాశాల అభివృద్ధికి సలహాలివ్వండి

పజాశక్తి-హిందూపురం

పట్టణంలోని ప్రభుత్వ ఎన్ఎస్‌పిఆర్ మహిళా డిగ్రీ కళాశాలను మరింత అభివృద్ధి చేసేందుకు కళాశాల కమిటీ ప్రతినిధులు సూచనలు, సలహాలు ఇవ్వాలని ప్రిన్సిపల్ డాక్టర్ ప్రగతి కోరారు. కళాశాలలో శుక్రవారం ప్రిన్సిపల్ అధ్యక్షతన సి.పి.డి.సి (కళాశాల ప్రణాళిక మరియు అభివృద్ధి కమిటీ) సమావేశం నిర్వహించారు. ఇందులో కళాశాల అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొని కళాశాల అభివృద్ధికి పలు సూచనలు చేసినట్లు ప్రిన్సిపల్ తెలిపారు. అనంతరం కళాశాల క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రణాళిక, అభివృద్ధి కమిటీ సభ్యులు బి.యస్. విద్యాసాగర్, రిటైర్డ్ ఏఈ గోవింద్ రెడ్డి, ఈశ్వర్ రెడ్డి, ఎజిపి శ్రీనివాసరెడ్డి, ఆర్టీసీ స్టాండింగ్ కౌన్సిల్ మెంబర్ జీ. ఆర్. సిద్ధు, కళాశాల వైస్ ప్రిన్సిపల్ వెంకటేశులు, అధ్యాపకులు శ్రీలక్ష్మి, శ్రీధర్, భోజప్ప, ఎల్ఆర్.రమేష్, సీనియర్ అసిస్టెంట్ బి. నరసింహులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పర్యవేక్షణ తప్పనిసరి

కలెక్టర్ టిఎస్.చేతన్



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ టిఎస్.చేతన్, జెసి

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

ఆయా ప్రాంతాల్లో జరుగుతు న్న అభివృద్ధి పనులను నియోజకవర్గ ప్రత్యేక అధికారులు క్షేత్రస్థాయిలో క్రమం తప్పకుండా పరిశీలన చేయాలని కలెక్టర్ టిఎస్.చేతన్ ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్లో నియోజక వర్గాల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఒ విజయ సారథి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడు తూ ఎన్టీఆర్ భరోసా పింఛన్లపై డివిజన్ స్థాయిలో సమీక్ష సమావేశాలు నిర్వహించి చర్చించాలన్నారు. గహ నిర్మాణ లేఅవుట్లపై నియంత్రణ ఉండాల న్నారు. ఉన్న వసతులను దృష్టిలో ఉంచుకుని స్థానిక ప్రజా ప్రతినిధుల సలహాలు తీసుకుని రాబోయే ఐదు సంవత్సరాలు నియోజకవర్గ అభివద్ధికి చర్యలు తీసుకోవాలన్నారు. నియోజకవర్గ దర్శనిక విజన్ ప్రణాళికలు అమలకు స్వర్ణాంధ్ర 2027 పది సూత్రాలను కచ్చితంగా అమలు చేయాలన్నారు. వ్యవసాయం అనుబంధ రంగం, సేవా రంగం, తదితర అంశాలపై తగిన నివేదికలు వచ్చే సమావేశానికి సిద్ధం చేసుకుని రావాలన్నారు. ప్రత్యేక అధికారి రోజు గృహ నిర్మాణ లే అవుట్లను సందర్శించాలన్నారు. ఫోక్సో బాల్య వివాహాలు మానవ హక్కుల గురించి నియోజకవర్గం స్థాయిలో సమావేశాలు నిర్వహించుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. కార్యక్రమంలో కదిరి, పెనుకొండ, మడకశిర, పుట్టపర్తి, ధర్మవరం ప్రత్యేకాధికారులు శర్మ, ఆనంద్, సూర్య నారాయణ రెడ్డి, సువర్ణ, మహేష్, డిఆర్‌డిఎ పీడీ నరసయ్య, డిఇఒ క్రిష్టప్ప, హౌసింగ్ పీడీ వెంకట నారాయణ, సిపిఒ విజయ్ కుమార్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి : సిఐ

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని ప్రతి దుకాణదారుడు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ముదిగుబ్బ సీఐ శివరాముడు సూచించారు. శుక్రవారం సాయంత్రం షాపు నిర్వాహకులతో సీఐ సమావేశం అయ్యారు. చెన్నై-హైదరాబాద్ జాతీయ రహదారిపై స్థానిక ప్రధాన రహదారిలోని దుకాణదారులు అందరూ తమ షాపుల వద్ద కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చోరీలను, మోసాలను అరికట్టేందుకు సీసీ కెమెరాలు ఉపయోగపడతాయన్నారు.

పట్టణ అభివృద్ధే ధ్యేయం

మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్



బాధ్యతలు చేపడుతున్న మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

రాజకీయ పార్టీలకు అతీతంగా హిందూపురం పట్టణాన్ని ఎమ్మెల్యే బాలకృష్ణ నేతృత్వంలో అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని మున్సిపల్ ఛైర్మన్ డీఈ రమేష్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం తన ఛాంబర్ లో ప్రత్యేక పూజలు నిర్వహించి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రూ.200 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టనున్న అభివృద్ధి పనులపై తొలి సంతకాన్ని చేశారు. మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులు ఛైర్మన్ రమేష్ కుమార్‌ను కలిసి పుష్ప గుచ్చం అందించారు. అదే విధంగా పలువురు కౌన్సిలర్లు, టిడిపి నాయకులు, మున్సిపల్ డిఈలు మోహన్, వాణి, అన్ని విభాగాల అధికారులు రమేష్ కుమార్ ను కలిసి పుష్ప గుచ్చం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రమేష్ కుమార్ మాట్లాడుతు పట్టణ ప్రజల సహాయ సహకారాలతో అన్ని విధాలా అభివృద్ధి చేసేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని తెలిపారు. ఇందుకోసం వైసిపి కౌన్సిలర్లు సైతం కలిసి రావాలన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ సంగం శ్రీనివాసులతో కలిసి అన్ని విభాగాల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజలకు సకాలంలో సేవలను అందించాలన్నారు. సేవలు అందించే విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిపై కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులతో పాటు పలువురు కౌన్సిలర్లు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఎంజిఎం పాఠశాలలో సన్మానం

మున్సిపల్ నూతన ఛైర్మన్ రమేష్‌కుమార్‌ను ఎంజిఎం పాఠశాలలో ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. హెచ్ఎం సామ్రాజ్యం మాట్లాడుతూ మున్సిపల్ ఛైర్మన్ రమేష్‌కుమార్ పాఠశాల పూర్వ విద్యార్థి కావడం సంతోషంగా గర్వకారణంగా ఉందన్నారు. పాఠశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని ఛైర్మన్ రమేష్‌కుమార్ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్సీ, ఎస్టీ రైతుల కోసం స్పెషల్ డ్రైవ్

ప్రజాశక్తి-అగళి

మండలంలో బోరుబావుల కింద వ్యవసాయం చేసే ఎస్సీ, ఎస్టీ రైతులను గుర్తించడానికి డ్రిప్ ఇరిగేషన్ ఎంఐఏఓ నరసింహులు, సిబ్బంది స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. అందులో భాగంగా వారు శుక్రవారం మండలంలోని పి.బ్యాడిగెర గ్రామంలో పర్యటించారు. పుట్టమ్మ, నరసింహమూర్తి, రంగనాథ్, తదితర రైతుల పొలాలను సందర్శించారు. వక్క, పూలు, కూరగాయలు, దానిమ్మ, సపోటా, బొప్పాయి, తదితర పంటలకు రాయితీపై డ్రిప్ పరికరాలు అందిస్తామని తెలిపారు. క్షేత్ర స్థాయిలో సర్వే చేసి రైతుల పేర్లు నమోదు చేసుకున్నారు. వారు మాట్లాడుతూ ఎస్సీ, ఎస్టీ రైతులను ఆదుకోవాలనే ఉద్దేశంతో కూటమి ప్రభుత్వం డ్రిప్ పరికరాలు, స్ప్రింక్లర్లు, బిందు సేద్య పరికరాలను రాయితీపై అంద జేస్తుందన్నారు. ఇంకా ఎవరైనా రైతులు ఉంటే ఎంఐఏఓను సంప్రదిస్తే వారం లోపు క్షేత్రస్థాయిలో సర్వే చేస్తామని, ఆ తర్వాత డిడి చెల్లించిన రైతులకు పరికరాలు అందిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని ఎస్సీ, ఎస్టీ రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు.



వక్క తోటను పరిశీలిస్తున్న ఎంఐఏఓ నరసింహులు

మెరుగైన వైద్య సేవలందించాలి

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశాన్ని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ మాధవి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో పలు విషయాలను చర్చించి తీర్మానం చేశారు. అనంతరం డాక్టర్ మాధవి మాట్లాడుతూ సమావేశంలో భాగంగా పట్టణంలోని పోతుకుంట రహదారి పక్కన కొత్తగా నిర్మించిన భవనంలో 50 పడకల తల్లి బిడ్డల ఆసుపత్రిని స్వతంత్ర ప్రతిపత్తిలో నిర్వహించుకొనుటకు ప్రభుత్వ అనుమతిని 2025-26లో పొందాలని తీర్మానించినట్లు చెప్పారు. ప్రతి రోగికి నాణ్యమైన వైద్య చికిత్సలను అందించడం జరగాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రికి మంచి గుర్తింపు పొందేలా అధికారులు సిబ్బంది పని చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రిని మరింత అభివృద్ధి పరచటానికి ధర్మవరం ఎమ్మెల్యే, మంత్రి సత్య కుమార్ యాదవ్‌తో చర్చిస్తామన్నారు. ఈ సమావేశంలో సభ్యులు డాక్టర్ నరసింహులు, డాక్టర్ సోనియా, ఏపీఎంఎస్ ఐడిసి శ్రీనివాసులు నాయుడు, రాధమ్మ, పుల్లయ్య, సభ్యులు కన్వీనర్లు పాల్గొన్నారు.

వరకట్న వేధింపులకు వివాహిత బలి

హత్యేనని మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు.. పోలీసుల అదుపులో భర్త, అత్త, మరిది

ప్రజాశక్తి-సోమందేపల్లి

వరకట్నం వేధింపులకు ఓ వివాహిత బలైన సంఘటన శుక్రవారం మండలంలోని కేతగాని చెరువు గ్రామంలో చోటుచేసుకుంది. మృతురాలి తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు పోలీసులు తెలిపిన వివరాలు.. కేతగానిచెరువు గ్రామానికి చెందిన ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన ఆదర్శ్ బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేసేవాడు. అతడికి ధర్మవరం పట్టణానికి చెందిన విజయనిర్మల, సురేష్‌కుమార్ దంపతుల కూతురు హిమజ(28)ను ఇచ్చి మూడేళ్ల క్రితం వివాహం జరిపించారు. పెళ్లి సమయంలో హిమజ తల్లిదండ్రులు ఆదర్శ్‌కు 14 తులాల బంగారు ఆభరణాలు, ఒకటిన్నర కిలో వెండి వస్తువులు, రూ. 2 లక్షల నగదు ఇచ్చారు. వారికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. వర్క్ ఫ్రం హోంలో భాగంగా ప్రస్తుతం ఆదర్శ్ ఇంటి వద్దే ఉండి విధులు నిర్వహిస్తున్నాడు. అదనపు కట్నం కోసం ఆదర్శ్ తన తల్లి సుశీలమ్మ, తమ్ముడు సతీష్‌తో కలిసి హిమజను పలుమార్లు వేధింపులకు గురిచేసేవారు. ఈ క్రమంలోనే వారు ముగ్గురూ కలిసి ఉదయం ఇంట్లో హిమజపై పెట్రోల్ పోసి నిప్పంటించి హత్య చేసి, ఆ తర్వాత ఆత్మహత్యగా చిత్రీకంచటానికి ప్రయత్నం చేశారని హిమజ తల్లిదండ్రులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి ఆదర్శ్‌తో పాటు సుశీలమ్మ, సతీష్‌లను అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఎంతో గారాబంగా పెంచి పెళ్లి చేసి అత్తారింటికి పంపిన కూతురిని కనీసం గుర్తుపట్టలేని స్థితిలో చూసి తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకొన్నాయి.



హిమజ(ఫైల్‌ఫొటో)

వాటర్‌ప్లాంట్ ప్రారంభం

ప్రజాశక్తి - తలుపుల

మండల పరిధిలోని లక్క సముద్రం గ్రామంలో సత్య సాయి బాబా ట్రస్ట్ ఆధ్వర్యంలో సింగపూర్ దేశానికి చెందిన దాతలు ఉచిత జలశుద్ధి కేంద్రాన్ని ఏర్పాటుచేయగా దాతలతో పాటు సర్పంచి తులసమ్మ టిడిపి యువ నాయకుడు సుదర్శన్ రెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా దాతలకు ఘనంగా సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సింగపూర్ బృంద సభ్యులు థామస్ టే, రోసితో పాటు విశ్వనాథ్ రెడ్డి గ్రామస్తులు పాల్గొన్నారు.

9న విగ్రహ పున: ప్రతిష్టాపన

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పురాతన వీరభద్ర స్వామి దేవస్థానం స్థానంలో నూతన దేవాలయాన్ని నిర్మించి గతంలో ఉన్న విగ్రహ పున: ప్రతిష్ట కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నట్లు వీరభద్ర స్వామి ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. పుట్టపర్తి మండల పరిధిలోని నిడిమామిడి గ్రామ సమీపంలో వంగ పేరు నది ఒడ్డున ఉన్న వీరభద్రేశ్వర స్వామి దేవాలయం పూర్తి శిథిలావస్థకు చేరుకోవడంతో దానిని తొలగించి రూ. 50 లక్షల వ్యయంతో నూతన ఆలయాన్ని నిర్మించారు .ఇందుకోసం ఆలయ కమిటీ సభ్యులు విరాళాలు సేకరించి నిర్మాణాన్ని సంవత్సర కాలంలో పూర్తి చేశారు. ఇందులో భాగంగా ఆదివారం విగ్రహ పున: ప్రతిష్ట కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

ఆలయ నిర్మాణానికి విరాళం

హిందూపురం :పట్టణంలోని గాంధీ సర్కిల్‌లో చేపట్టిన శ్రీ లక్ష్మీనరసింహ స్వామి ఆలయ నిర్మాణం కోసం దాతలు విరాళం అందజేశారు. కెబి. బాలచంద్ర, వారి కుమారుడు అశ్విన్ రూ.2,01,116లు ఆలయ కమిటీ వారికి అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వహకులు నిమ్మకాయల రాము, రాఘవేంద్ర, చంద్ర మోహన్, మంగేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవాలాల్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఓబుల దేవర చెరువు

సంత్ సేవాలాల్ జయంతి ఉత్సవాలను జయప్రదం చేయాలని ఆలిండియా బంజారా సేవా సంఘం జిల్లా సంయుక్త కార్యదర్శి బి మోహన్ నాయక్ కోరారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. గుత్తిలోని సేవా ఘడ్ లో ఈనెల 13, 14, 15, జరుగు ఉత్సవాల్లో గిరిజనులు అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని ఆయనతో పాటు వెంకటరమణా నాయక్ కోరారు.

తాగునీటి కోసం నిరసన

ఖాళీ బిందెలతో గ్రామస్తుల ఆందోళన



ఖాళీబిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

తమకు తాగడానికి నీరివ్వాలని మండల పరిధిలోని తుమ్మలకుంట గ్రామస్తులు కోరారు. గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ గ్రామస్థులు సిపిఎం ఆధ్వర్యంలో ఎంపిడిఒ కార్యాలయం వద్ద శుక్రవారం ఆందోళన చేపట్టారు. ఖాళీ బిందెలతో ఆందోళన చేస్తూ అధికారుల నిర్లక్ష్య వైఖరి నశించాలని నినాదాలు చేశారు. వేసవి ప్రారంభం కాక మునుపే తాగునీటి సమస్య గ్రామాల్లో నెలకొందని అన్నారు. ముఖ్యంగా తుమ్మలకుంట గ్రామంలో నీటి సమస్యను పలుసార్లు కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లామని ఆయన పట్టించుకోలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక వేరే దారిలేక ఎంపిడిఒ కార్యాలయం ముందు ఆందోళన చేయల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. ఇప్పటికైన అధికారులు స్పందించి తాగునీటి సమస్య పరిష్కరించాలని సిపిఎం నాయకులు ఫిరంగి ప్రవీణ్ కుమార్, రామచంద్ర డిమాండ్ చేశారు. సమస్యను పరిస్కరించకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. స్పందించిన ఈవోఆర్డీ ప్రభుదాస్, కార్యదర్శి సావిత్రి, రామ్లా నాయక్ తదితరులు గ్రామంలో పర్యటించారు. బోరు బావులను పరిశీలన చేసి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ కార్యక్రమంలో తుమ్మలకుంట గ్రామస్తులు పాల్గొన్నారు

పేదలకు ఇళ్లస్థలాలివ్వండి



నిరసనలో నాయకులు, బాధితులు

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరి పట్టణంలోని 6వ వార్డు పాత అమీన్ నగర్ ,న్యూ అమీన్ నగర్ లో సొంత ఇల్లు లేక నెలనెలా ఇంటి అద్దెలు చెల్లించలేక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారికి ఇళ్లస్థలాలు ఇవ్వాలని అమీన్ నగర్ అభివృద్ధి వేదిక కన్వీనర్ సాంబశివ డిమాండ్ చేశారు. నివాసాలు లేని వారిని గుర్తించడానికి వారం రోజులపాటు అమీన్ నగర్ అభివృద్ధి వేదిక కమిటీ ఆధ్వర్యంలో సర్వే చేసి పూర్తిగా సొంత ఇల్లు లేకుండా బాడుగ ఇళ్లలో నివాసం ఉంటున్న 113 మంది పేదలను గుర్తించారు. వారు శుక్రవారం 6వ వార్డు రాజీవ్ గాంధీ సచివాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం నివేశ స్థలాలకు దరఖాస్తు చేసుకున్నారు.ఈ సందర్భంగా అమీన్ నగర్ అభివృద్ధి వేదిక కన్వీనర్ బత్తల సాంబశివ మాట్లాడుతూ వారం రోజులపాటు నిర్వహించిన సర్వేలో పేదల కష్టాలు కన్నులారా చూశామన్నారు. చేతినిండా పని లేక అర్ధాకలితో కుటుంబాలను పోషిస్తున్నారని చాలీ చాలని ఆదాయంతో, నెల నెలా ఇంటి బాడగలు , పెరిగిన ధరలు , పిల్లల చదువులు భారం అవుతున్నాయని పేదలు వాపోయారన్నారు. గతంలో అనేక సార్లు అధికారులకు చెప్పుకున్న ఫలితం లేదని వాపోయారు. ఇండ్ల పనులు ,గుజురి ఏరుకునే వారు , రోజు కూలి, హమాలీ పనులు, చేస్తున్నామని పేదలు తమ దృష్టికి తెచ్చారన్నారు. సర్వేలో వచ్చిన అంశాల వారీగా అధికారుల దృష్టికి తీసుకెళ్ళి పేదలకు న్యాయం జరిగేంతవరకు అమీన్ నగర్ అభివృద్ధి వేదిక అండగా ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో అభివృద్ధి వేదిక కమిటీ సభ్యులు నారాయణ, లక్ష్మీనరసమ్మ, సుగుణ, నారాయణమ్మ, రవణమ్మ, రిజ్వాన్, దిల్షాద్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు భరోసా కల్పించాలి : ఎస్పీ



గౌరవ వందనం స్వీకరిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి - బత్తలపల్లి

తమ సమస్యలపై పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేస్తారనే భరోసా కల్పించాలని జిల్లా ఎస్పీ రత్న పోలీస్ సిబ్బందికి సూచించారు. ఈ మేరకు ఆమె శుక్రవారం బత్తలపలి పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ సిబ్బందిచే ఎస్పీ గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం మహిళ హెల్ప్ డెస్క్‌ను ధర్మవరం డిఎస్పి హేమంత్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. మహిళా కానిస్టేబుల్ లలితతో మహిళా హెల్ప్ డెస్క్ నిర్వహణపై ఆరా తీశారు. పోలీస్ స్టేషన్లో స్టేషన్ రైటరు,ఫిమేల్ లాకప్, మేల్ లాకప్ పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. బాధితులు న్యాయం కోసం పోలీస్ స్టేషన్‌కు వచ్చినప్పుడు వారి సమస్యలను తెలుసుకుని న్యాయం చేస్తారనే భరోసా కల్పించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తాడిమర్రి, ముదిగుబ్బ, పట్నం పోలీస్ స్టేషన్ తనిఖీకి వెళ్లారు. ఈ కార్యక్రమంలో రూరల్ సిఐ ప్రభాకర్, ఎస్ఐలు సోమశేఖర్, శ్రీనివాసులు, ఎఎస్ఐ సోమశేఖర్ మూర్తి, స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్ శంకర్, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాడిమర్రి : శివరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఎస్పీ రత్న సూచించారు. ఈ మేరకు ఆమె శుక్రవారం తాడిమర్రి మండల పరిధిలోని చిల్లవారిపల్లి గ్రామాన్ని సందర్శించారు. ఫిబ్రవరి 25 ,26వ తేదీలలో నిర్వహించనున్న శ్రీ కాటి కోటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని ఉత్సవాల సందర్భంగా గొడవలకు పాల్పడి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్పీ రత్న హెచ్చరించారు. అనంతరం ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఆలయ కమిటీ సభ్యులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ హేమంత్ కుమార్, సిఐ శ్యామ్‌రావు, ఎస్ఐ కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ : మండల కేంద్రంలోని అర్బన్, రూరల్ పోలీస్ స్టేషన్లను ఎస్పీ రత్న శుక్రవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్లోని రికార్డులను పరిశీలించారు. స్టేషన్ నిర్వహణ, సిబ్బంది పనితీరుపై ఆరాతీశారు. శాంతిభద్రతల పరిరక్షణపై సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ధర్మవరం డీఎస్పీ హేమంత్ కుమార్, సిఐలు శివరాముడు, శ్యామ్ రావు, పోలీసులు పాల్గొన్నారు.

నేడు ఎమ్మెల్యే ప్రజా ఫిర్యాదుల వేదిక

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ఆధ్వర్యంలో పుట్టపర్తి నియోజకవర్గ ప్రజల సమస్యల పరిష్కారం కోసం శనివారం పుట్టపర్తి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఈనెల 15 న ఒడిసిలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను నిర్వహిస్తున్నట్లు నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి వ్యక్తిగత కార్యదర్శి ముద్దుపాటి లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరణ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి డాక్టర్ పల్లె రఘునాథ్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వాటిని పరిష్కరించుకోవాలని కోరారు. అదేవిధంగా ఈనెల 15న శనివారం ఓడి చెరువు టిడిపి కార్యాలయంలో ప్రజా ఫిర్యాదుల కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఫిర్యాదుల విభాగానికి ఓడిచెరువు ,నల్లమాడ , ఆమడగూరు మండలాలతో పాటు నియోజకవర్గ ప్రజలు తమ సమస్యలను స్వయంగా ఎమ్మెల్యే ,మాజీ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం పొందాలని పేర్కొన్నారు.

కదిరి టౌన్ :కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా వివిధ సమస్యలు ఎదుర్కొంటున్న ప్రజల కోసం ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ శనివారం పట్టణంలోని రోడ్లు భవనాలు అతిథిగృహంలో ప్రజాదర్బార్ నిర్వహించనున్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కొరకు ప్రజావేదిక ద్వారా అర్జీలు స్వీకరించనున్నారు. కదిరి నియోజవర్గ వ్యాప్తంగా కూటమి నాయకులు ప్రజా సమస్యలపై వచ్చే ప్రజలు ప్రతి ఒక్కరూ తమ అర్జీలకు ఆధార్ కార్డ్, ఫోన్ నెంబర్, జత చేసి ప్రజా దర్బార్ ప్రజా వేదికలో ఎమ్మెల్యే కందికుంటకు అర్జీలు సమర్పించాలని నాయకులు కోరారు.

రాష్ట్ర స్థాయి బాస్కెట్ బాల్ పోటీలకు ధర్మవరం విద్యార్థులు

ప్రజాశక్తి -ధర్మవరంరూరల్

రాష్ట్ర స్థాయిలో ఈ నెల ఫిబ్రవరి 8వ తేదీ నుండి 11 వ తేదీ వరకు కాకినాడ జిల్లా పిఠాపురం పట్టణంలో జరిగే 8 వ ఆంధ్రప్రదేశ్ యూత్ ఇంటర్ డిస్టిక్స్ పోటీల్లో పాల్గొనే ఉమ్మడి అనంతపురం బాస్కెట్‌బాల్ బాల బాలికల జట్లకు ధర్మవరం విద్యార్థులు ఎంపికయ్యారు. విభాగంలో ధర్మవరం పట్టణానికి నీఖ్యశ్రీ , యశస్విని,అంజన, అలేఖ్య, బాలుర విభాగంలో కార్తీక్ నాయక్, లక్ష్మీనరసింహ ఎంపికయ్యారు. ధర్మవరం పట్టణానికి చెందిన ఆరుగురు బాస్కెట్‌బాల్ క్రీడాకారులు ఎంపిక కావడం గర్వకారణమనిఉమ్మడి జిల్లా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అసోసియేట్ సెక్రటరీ శెట్టిపి జయ చంద్రా రెడ్డి తెలిపారు. ఫిబ్రవరి 4వ తేదీన అనంతపురం నగరంలోని ఇండోర్ స్టేడియంలో జరిగిన సెలక్షన్‌లో వీరు ప్రతిభ చూపి ఉమ్మడి అనంతపురం జిల్లా జట్లకు ఎంపికయ్యారని చెప్పారు. వీరి ఎంపిక పట్ల ఉమ్మడి జిల్లా అసోసియేషన్ ధర్మాంబా బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షులు మేడాపురం రామి రెడ్డి, కార్యదర్శి వాయల్పాడు హిదయ తుల్లా, కోచ్ సంజయ్ హర్షం వ్యక్తం చేశారు.



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

ఉపాధ్యాయుల పనితీరుపై ఫిర్యాదు



విద్యార్థులతో మాట్లాడుతున్న అధికారులు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

స్థానిక జెడ్పి హైస్కూల్‌లోని మధ్యాహ్న భోజన పథకం అమలుతీరు, నీటి సౌకర్యం,ఉపాధ్యాయుల పనితీరుపై నందు శుక్రవారం సామాజిక తనిఖీ బృందం విచారణ చేపట్టింది. ఈ విచారణ సమావేశానికి విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీని ఆహ్వానించారు. తల్లిదండ్రుల కమిటీ విచారణ బృందానికి పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజనం గంజి కట్టుతున్నదని, కూరలు రుచికరంగా లేవని తెలిపారు. తాగునీటి సమస్య అధికంగా ఉందని, మరుగుదొడ్లు దుర్వాసనతో నిండిపోయాయని అన్నారు ప్రధానంగా ఉపాధ్యాయుల పనితీరు సరిగా లేదని, తమ పిల్లలకు విద్యా భోధన అందించడంలో విఫలమవుతున్నారని ఫిర్యాదు చేశారు. వారు చెట్టు కింద కూర్చొని సొంత పనుల చర్చించుకుంటున్నారని సామాజిక తనిఖీ సభ్యులకు ఫిర్యాదు చేశారు. పాఠశాలకు వచ్చే నిధులు పక్కదారి పడుతున్నాయని,దాతలు సహాయం చేస్తేనే పలు అభివృద్ధి పనులు చేయిస్తున్నారే తప్ప పాఠశాలకు ప్రభుత్వం అందించే నిధులు ఎక్కడ ఖర్చు చేస్తున్నారో ఇప్పటికి తెలియడం లేదని అన్నారు. అనంతరం తనిఖీ అధికారులు కెజిబివిని తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మధ్యాహ్న భోజనం మెనూ పాటించడంలో పాఠశాల సిబ్బంది విఫలం అయ్యారని, తాగునీటి సమస్య అధికంగా ఉందని మరుగుదొడ్లు కూడా సౌకర్యవంతంగా లేవని గుర్తించారు. ఈ విషయాలపై నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తామని తనిఖీ బృంద సభ్యులు తెలిపారు.

డ్రైవర్లకు ఉచిత వైద్యశిబిరం

ప్రజాశక్తి - కదిరి టౌన్

పట్టణంలోని రవాణా శాఖ కార్యాలయం నందు కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ సహకారంతో అనంతపురం కిమ్స్ సవేరా ఆసుపత్రి సౌజన్యంతో వైద్యులు డ్రైవర్లకు ఉచిత వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ శిబిరానికి అనూహ్య స్పందన లభించింది . డ్రైవర్లు పెద్ద ఎత్తున తరలివచ్చి సద్వినియోగం చేసుకున్నారు. ఈ సందర్భంగా రవాణాశాఖ అధికారి కరుణాసాగర్ రెడ్డి మాట్లాడుతూ డ్రైవింగ్ చేసేటప్పుడు రహదారి ప్రమాణాలు పాటిస్తే భద్రతకు భరోసా ఉంటుందని అన్నారు. ఆర్డీవో వివిఎస్ శర్మ మాట్లాడుతూ వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మోటర్ వాహనాల తనిఖీ అధికారి వరప్రసాద్, అసిస్టెంట్ మోటార్ వాహనాల తనిఖీ అధికారి రాజేష్ , వాల్మీకి విద్యాసంస్థల అధినేత అనిల్ కుమార్ రెడ్డి, వైద్యులు శ్రీనివాసులు, కిమ్స్ ఆస్పత్రి బృందం, తదితరులు పాల్గొన్నారు.

అంతర్రాష్ట్ర దొంగ అరెస్టు

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

నల్లమాడ, ఓబుల దేవర చెరువు మండలాల్లో చైన్ స్నాచింగ్ కు పాల్పడిన నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. శుక్రవారం పుట్టపర్తి డిఎస్పీ కార్యాలయంలో సిఐ నరేందర్ రెడ్డి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఈ కేసు వివరాలను వెల్లడించారు. నిందితునిపై గతంలో 10 చైన్ స్నాచింగ్ కేసులు ఉన్నట్లు తెలిపారు. అన్నమయ్య జిల్లా కోటకొండ గ్రామానికి చెందిన ముద్దం చంద్రశేఖర్ అనే నిందితుడు, అతని అనుచరులు ఆరుగురితో కలిసి అన్నమయ్య చిత్తూరు జిల్లాల్లో చైన్ స్నాచింగ్ కేసులలో మదనపల్లి సబ్ జైల్ నుంచి జనవరి 20వ తేదీన విడుదలైనట్లు తెలిపారు. ముద్దం చంద్రశేఖర్ మరో నిందితునితో కలిసి గత నెల 26వ తేదీన కర్నాటక రాష్ట్రం చింతామణిలో ద్విచక్ర వాహనాన్ని దొంగలించి అదే రోజున నల్లమాడ మండలం డీ. చెర్లోపల్లిలో చైన్ స్నాచింగ్‌కు పాల్పడినట్లు తెలిపారు. 27వ తేదీన కర్నాటక రాష్ట్రం బాగేపల్లిలో చైన్ స్నాచింగ్ కు పాల్పడి అదే రోజున ఓబులదేవరచెరువు రెయిన్ బో స్కూల్ వద్ద కిరాణా షాపులో ఓ మహిళ మెడలో నుంచి బంగారపు గొలుసు లాకెళ్లినట్లు తెలిపారు. వరుసగా జరిగిన ఈ చైన్ స్నాచింగ్ కేసులను ప్రతిష్టాత్మకంగా తీసుకొని విచారణ నిర్వహించామని వివరించారు. ఈ నేపథ్యంలో నిందితుడిని ఓబులదేవరచెరువు మండలం మహమ్మదాబాద్ క్రాస్ వద్ద అరెస్టు చేసినట్లు తెలిపారు. చైన్ స్నాచింగ్ కేసును చేదించడంలో కృషిచేసిన ఎస్ఐ మల్లికార్జున రెడ్డిని, పోలీస్ సిబ్బందిని ఎస్పి రత్న అభినందించినట్లు సిఐ నరేంద్రరెడ్డి వెల్లడించారు.

జాబ్‌మేళాకు విశేష స్పందన

ప్రజాశక్తి - ధర్మవరం టౌన్

పట్టణంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన జాబ్ మేళాకు విశేష స్పందన లభించినట్లు కళాశాల ప్రిన్సిపల్ జేవి. సురేష్ బాబు తెలిపారు. ఈ సందర్భంగాపాయన మాట్లాడుతూ మంత్రి సత్య కుమార్ యాదవ్ ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, జిల్లా ఎంప్లాయిమెంట్ ఆధ్వర్యంలో ఈ జాబ్ మేళా కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. యువతకు ఉద్యోగ కల్పనలో భాగంగానే నియోజకవర్గంలోని జాబ్ మేళా ను నిర్వహించడం సంతోషదాయకంగా ఉందని తెలిపారు. 112 మంది ఇంటర్వ్యూలకు అభ్యర్థులు హాజరు కాగా అందులో 52 మంది వివిధ కంపెనీలకు ఎంపికయినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నైపుణ్యాభివృద్ధి ప్లేస్‌మెంట్ అధికారి తేజ కుమార్, సిటాప్ డిపిటిఎమ్ నారాయణస్వామి, ఏపీ స్టేట్ సిల్క్ డెవలప్మెంట్ కార్పొరేషన్ సిబ్బంది, సీడాప్ సిబ్బంది, ఎంప్లాయిమెంట్ అధికారి, కళాశాల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తనివ్వొద్దు

ప్రజాశక్తి - కొత్తచెరువు

వేసవికాలం ప్రారంభమవుతున్న నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో నటరాజు ,తెలిపారు. మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సచివాలయ సిబ్బందితో ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో నీటి కొరత ఉన్న వాటిని గుర్తించి అక్కడ నూతన బోర్లు వేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేసుకోవాలన్నారు. చెడిపోయిన చేతిపంపులను మరమ్మతులు చేయించాలన్నారు. గ్రామాల్లో నెలకొన్న నీటి సమస్యను గుర్తించి వాటిపై నివేదికను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు రాంగోపాల్ రెడ్డి, గంగాధర్ రెడ్డి, అజయ్, తదితరులు పాల్గొన్నారు.

వైద్యుల్లో సేవాభావం పెరగాలి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్



ఆసుపత్రిని ప్రారంభిస్తున్న పరిటాల శ్రీరామ్

జనాభా రోజు రోజుకీ పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రైవేటు ఆసుపత్రుల సేవలు కూడా చాలా అవసరం అని ధర్మవరం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ అన్నారు.శుక్రవారం ధర్మవరం పట్టణంలో నూతనంగా ఏర్పాటు చేసిన హిమ బిందు ఐ టెస్టింగ్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీరామ్ మాట్లాడుతూ ప్రైవేటు ఆసుపత్రుల వారు ప్రజల్ని వ్యాపార కోణంలో చూడవద్దన్నారు. డబ్బు ముఖ్యమే అయినప్పటికీ వైద్యులు సేవా భావంతో ఉండాలని సూచించారు. కంటి చూపు విషయంలో ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి పట్టణ అధ్యక్షులు పరిసే సుధాకర్, మాధవరెడ్డి, నాగూర్ హుస్సేన్, ప్రసాద్ నాయుడు కమతం కాటమయ్య తదితరులు పాల్గొన్నారు.

రమాబాయి జీవితం ఆదర్శనీయం

ప్రజాశక్తి-హిందూపురం

ప్రతి ఒక్కరూ రమాబాయి అంబేద్కర్‌ను ఆదర్శంగా తీసుకొని ముందుకు వెళ్లాలని కెవిపిఎస్ జిల్లా ప్రదాన కార్యదర్శి రమణ, ఎం.ఎస్.ఎఫ్ అధ్యక్షులు రవికుమార్ పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక గురుకుల కళాశాలలో రమాబాయి అంబేద్కర్ 127వ జయంతిని దళిత సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొలుత రమాబాయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం వారు మాట్లాడుత రమాబాయి చేసిన కృషి నేటి సమాజానికి ఎంతో మంది మహిళలకు ఆదర్శమన్నారు. ఇలాంటి మహనీయుల మార్గాల్లో ప్రతి ఒక్కరూ నడవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జైభీమ్ నాయకులు నాగరాజు, రామాంజి తదితరులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ స్థాయిలో 'పురం' విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-హిందూపురం

నాసా యూఎస్ఏ కు చెందిన ఫెడరల్ ఏజెన్సీ వారు నిర్వహించిన ప్రాజెక్టులో భాగంగా హిందూపురం నారాయణ విద్యార్థులు సజన్, ప్రణవ్, కార్తీక్ రెడ్డి రాణించారు. వారు తయారు చేసిన ప్రాజెక్టుకు అంతర్జాతీయ స్థాయిలో ద్వితీయ బహుమతి లభించింది. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులను నారాయణ పాఠశాల ఎజిఎం రమేష్ బాబు, ఉపాధ్యాయులు అభినందించారు. అనంతరం రమేష్ బాబు మాట్లాడుతూ విద్యార్థులలో అంతరిక్ష పరిజ్ఞానం పెంచేందుకు ఈ కార్యక్రమం ఎంతగానో స్ఫూర్తిని ఇస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్ ప్రేమ్ సాగర్, హెచ్ఎం రాజేష్, ప్రభాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాజీ సిఎం జగన్‌ను కలిసిన వేణురెడ్డి

ప్రజాశక్తి-హిందూపురం

మాజీ ముఖ్యమంత్రి, వైసిపి అధినేత వైయస్ జగన్ మోహన్ రెడ్డిని హిందుపురం నియోజకవర్గ వైసిపి నాయకులు నేత వేణురెడ్డి కలిశారు. బెంగళూరు విమానాశ్రయంలో వైయస్ జగన్ మోహన్ రెడ్డి తో పాటు మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని వేణు రెడ్డి కలిసి బొకే అందజేశారు. ఈ సందర్భంగా వేణు రెడ్డి జగన్ మోహన్ రెడ్డిని శాలువాతో సన్మానించారు. అనంతరం పలు రాజకీయ అంశాలపై జగన్ వేణు రెడ్డితో చర్చించారు.

గుండెపోటుతో చేనేత కార్మికుడు మృతి

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణంలోని 8వ వార్డు నాగుల బావి వీధికి చెందిన చేనేత కార్మికుడు శ్రీ సాకే శ్రీరాములు శుక్రవారం ఉదయం గుండెపోటుతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి కార్యాలయ ఇన్‌ఛార్జి హరీష్ బాబు తదితరులు శ్రీరాములు మృతదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. మృతుని కుటుంబానికి ఆర్థికసాయం అందజేశారు.

ఎస్ఐగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి- చిలమత్తూరు

చిలమత్తూరు పోలీస్ స్టేషన్‌లో ఎఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న డి. సుబ్బరామ్ నాయకు ఎస్ఐగా ఉద్యోగోన్నతి లభించిందని స్థానిక ఎస్ఐ మునీర్ అహ్మద్ తెలిపారు. ఈ మేరకు ఆయన హిందూపురం టూ టౌన్ ఎస్ఐగా బాధ్యతలు తీసుకోనున్నారన్నారు. ఈ సందర్భంగా సుబ్బరామ్ నాయక్‌కు ఎస్ఐ మునీర్ అహ్మద్, హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసులు కానిస్టేబుల్ రమేష్ నాయక్, విజయ్ నాయక్, పోతులయ్య, పవన్, శ్రీరాములు, రమణ, వేమరెడ్డి శుభాకాంక్షలు తెలిపారు.